# పిచ్చి తగ్గింది

## - కోలపల్లి ఈశ్వర్

రెండు చేతుల్లోనూ రెండు పెద్ద పెద్ద సూట్‌కేసుల్తో ముందుగా గుమ్మంలో గుర్నాథం ప్రత్యక్షమయ్యాడు. అతని వెనుక శేషుమాంబ, ఆమె చేతిలో ఓ మీడియం సైజు సూట్‌కేసు. ఆ వెనుక వాళ్ల సంతానం తొమ్మిదేళ్ళ బబ్లూగాడు, ఏడేళ్ళ టింకూగాడూ, అయిదేళ్ల బుజ్జి.

హాల్లో సోఫాలో కూర్చుని పుట్టబోయే బిడ్డడి కోసం ఊలుతో స్వెట్టర్ అల్లుతున్న ఊర్మిళ వాళ్లందర్నీ చూసి ముఖం నిండా సంతోషాన్ని పులుముకుంది.

“వచ్చేసారా? రండ్రండి. బాగున్నారా అందరూ?” అంటూ సోఫాలోంచి లేచి ఆనందంగా వాళ్లకెదురేగి ఆహ్వానించింది.

అంతలోనే సడెన్‌గా ఏదో గుర్తొచ్చినదానికి మల్లే కొంగుతో కళ్లొత్తుకుంది.

“ఏంటమ్మా? ఏమైంది?”

“ఏంటి ఉర్రూ? ఏమైంది?”

ఆ దంపతులిద్దరూ రవ్వంత ఆందోళనగా అడిగారు.

“అంతా నా ఖర్మ బావగారూ! కాసేపాగితే మీకే తెలుస్తుంది” అనేసి “ఏవండీ ఎవరొచ్చారో చూడండీ” అని గట్టిగా ఓ కేక వేసింది బాత్రూంలో ఉన్న భర్తను ఉద్దేశించి. ఆ మీదట ‘నా పిచ్చిగానీ ఆయనకి అర్థమవ్వద్దూ?’ అంది తనలో తానే గొణుక్కుంటున్నట్లుగా.

“అదేంటమ్మా అలా అంటున్నావు?” అన్నాడు గుర్నాథం ఆశ్చర్యంగా.

“అంతా నా ఖర్మ బావగారూ” అంటూ మరోమారు కొంగుతో కళ్లొత్తుకుంది ఊర్మిళ.

“ఏమైంది ఉర్రూ? ఎందుకు మాటిమాటికీ ఇలా కంట తడిపెడుతున్నావు?” శేషుమాంబ అడిగింది ఆందోళనగా.

“నా బ్రతుక్కి ఇంక మిగిలింది ఈ కన్నీళ్ళే నక్కా” అని ఊర్మిళ ఇంకా ఏదో చెప్పబోతుండగా బాత్రూంలోంచి అప్పుడే బయటకొచ్చిన శంకర్ ఇల్లంతా తడి చేస్తూ వచ్చాడక్కడికి. అతను దాదాపు ముప్పావు నగ్నంగా ఉన్నాడు. మొల చుట్టూ చిన్న తుండుగుడ్డ మాత్రమే వుంది.

వస్తూనే తలకాయని బొంగరంలా గిర్రున తిప్పుతూ హాల్లోవున్న వాళ్లందరికేసి ఓమారు విచిత్రంగా చూసి “ఎవరు వీళ్లంతా? పాకిస్తాన్ గూఢచారులా?” అన్నాడు.

“ఏమిటండీ ఆ మాటలు? మా శేషుమాంబ అక్కావాళ్లొచ్చారు. సరిగ్గా చూడండి గుర్తుకు వస్తుంది. ఆయన గుర్నాథం బావగారు. వీడు బబ్లూ, అదిగో వాడు టింకూ, ఆ టీపాయ్ మీద కూర్చున్నది బుజ్జి. ఇదిగో ఇది మా శేషుమాంబ అక్క” ఒక్కొక్కర్నే వేలెత్తి చూపుతూ భర్తతో అంది ఊర్మిళ.

“ఎవరైతే నాకేంట్లే. నేనేవన్నా ఏనుగు మాంసం తింటానా ఏంటి? సరే నాక్కొంచెం గడ్డి పెట్టు నేను ఆఫీసుకెళ్లాలి” అన్నాడు శంకర్. అంటూనే తన మొలకి వున్న తుండుగుడ్డని విప్పేయబోయాడు.

కానీ ఊర్మిళ “ఏవండీ” అని బిగ్గరగా అరవడంతో ఆగిపోయాడు.

గుర్నాథం దంపతులూ, వాళ్ల పిల్లలూ అతనికేసి మతిపోయినట్లు చూస్తుంటే “ఆరునెలలయ్యిందక్కా?” అని మళ్లీ కొంగుతో కళ్లొత్తుకుంది ఊర్మిళ.

“ఏమిటే?” అంది శేషుమాంబ గాభరాగా.

“అదేనక్కా ఈయనకి పిచ్చెక్కి ఆర్నెల్లయ్యింది. ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో, ఎప్పుడు ఏం వాగుతారో ఆయనకే తెలీదు. మనుషుల్ని కూడా సరిగ్గా గుర్తుపట్టలేరు. ఒక్కోసారి ఒంటిమీద బట్ట కూడా సరిగ్గా ఉంచుకోరు” చెబుతుంటే ఊర్మిళ కళ్ల వెంబడి జలజలా కన్నీళ్లు రాలాయి.

“నిజమా? నిజంగా శంకర్‌కి పిచ్చెక్కిందా?” అన్నాడు గుర్నాథం నమ్మలేకపోతూ.

“అవును బావగారూ! ఏ జన్మలో ఏ పాపం చేసుకున్నానో ఈ జన్మలో నా ఖర్మ ఇలా కాలిపోయింది” వెక్కుతూ అంది ఊర్మిళ.

“మరి డాక్టర్‌కి చూపించలేదా?” శేషుమాంబ అడిగింది.

“ఎందుకు చూపించలేదక్కా. వారానికోసారి ఇంటికొచ్చి ట్రీట్‌మెంట్ ఇస్తూనే ఉన్నాడాయన. మందులూ అవీ వాడుతూనే ఉన్నాం. కానీ ఫలితమేదీ కన్పించడంలేదు” చెప్పి దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచింది ఊర్మిళ.

“అసలెందుకు జరిగిందిలా?” గుర్నాథం అడిగాడు సోఫాలో సర్దుకుని కూర్చుంటూ.

“ఎందుకంటే ఏం చెప్పను బావగారూ? అంతా నా ఖర్మ, ప్రారబ్ధం” చిన్నగా నెత్తి బాదుకుంది ఊర్మిళ.

అంతలో శంకర్రావు “ఏంటా వెధవ్వాగుడు? నెపోలియన్ బోనపార్టీలో ప్రవర్తించే విధానం ఇదేనా? మర్యాదగా మీరంతా సరెండరయిపోండి. లేకపోతే ఒక్కొక్కళ్లన్నీ పిట్టల్ని కాల్చినట్లు కాల్చి చంపేస్తా” అని గట్టిగా అరిచాడు.

గుర్నాథం దంపతులు అతనికేసి భయం భయంగా చూస్తుంటే-

“వాళ్ళు మన చుట్టాలండీ. శత్రువులు కాదు కాల్చి చంపడానికి” అంది ఊర్మిళ కన్నీరు ఉబుక్కొస్తుండగా.

“అయితే చంపకూడదా?”

“కూడదు.”

“కూడదని చెప్పడానికి నువ్వెవర్తివి? పధ్నాలుగేళ్లు నన్ను మోసిన నా ఐరావతాన్నే చంపేసిన పరమ కిరాతకుడ్ని నేను. వీళ్లని చంపడం నాకొక లెక్కా?”

“అలాగా. అయితే చంపండి చూద్దాం”

ఊర్మిళ అలా అంటుంటే గజగజా వణికిపోయింది శేషుమాంబ.

“వద్దమ్మా అతన్నలా రెచ్చగొట్టొద్దు” అంది చేతులు జోడిస్తూ.

“ఏం ఫర్వాలేదక్కా. ఆయన ఊరికే అలా అంటారు. నిజంగా చంపరు” అంది ఊర్మిళ.

“చంపరని గ్యారంటీ ఏంటి?”

“చంపరక్కా. మొన్నొకసారి మా కుక్కపిల్ల జూలీని బావిలో పడేసారు. అంతకుముందొకసారి మా ఎదురింటి వాళ్లబ్బాయి చిన్నాని బెల్టుతో దూలానికి వేళ్లాడదీసారు. ఏదో ఇలాంటి చిన్న చిన్న అవకతవక పనులు చేస్తుంటారేతప్ప ఆయన నిజంగా మనుషుల్ని చంపరు. ఒకరోజు నామీద కిరసనాయిలు గుమ్మరించారేగానీ అందుబాటులో అగ్గిపెట్టున్నా కూడా గీసి అంటించలేదు. ఏదో ఇలాంటి బెదిరింపు పనులు చేస్తుంటారే తప్ప

నిజంగా మనుషుల్ని చంపేటంత క్రూరత్వం ఆయనలోలేదు'' నమ్మకంగా పలికింది ఊర్మిళ.

"ఇప్పుడు నువ్వు చెప్పినవన్నీ చిన్న చిన్న అవకతవక పనులేనంటావా అమ్మా?'' గుర్నాథం అడిగాడు గుండె బేజారెత్తిపోతుండగా.

ఊర్మిళ ఏదో అనబోయింది. కానీ ఈలోగా "అందరూ కుక్కిన పేనుల్లా పడుండండి. లేకపోతే నా ఐరావతాన్ని మళ్లీ బ్రతికించి దానితో మీ అందర్నీ కుమ్మించేస్తాను'' అని బిగ్గరగా అరిచాడు శంకర్.

"చూడబోతే పిచ్చి చాలా ముదిరిపోయినట్టుందమ్మా. ఇలాంటివాడ్ని ఇంకా ఇంట్లో పెట్టుకోవడం ఏంటి? తీసుకెళ్లి పిచ్చాసుపత్రిలో జాయిన్ చేసేయ్యి లేకపోయావా?'' గుర్నాథం సలహా ఇస్తున్న ధోరణిలో అన్నాడు.

"అలా పిచ్చాసుపత్రిలో జాయిన్ చేస్తే ఆయన ఉద్యోగానికి ముప్పని చెప్పారు బావగారూ ఆయన కొలీగ్సంతా. అందుకే సిక్‌లీవ్ పెట్టించి ఇంట్లోనే ట్రీట్‌మెంట్ చేయిస్తున్నాను'' చెప్పింది ఊర్మిళ.

"అసలీ పిచ్చి ఆయనకు ఎందుకొచ్చినట్లు? పోయిన వేసవిలో మేం వచ్చినప్పుడు బాగానే ఉన్నాడుగా?''

"ఏమో బావగారూ. డాక్టర్ కూడా ఈయనకి పిచ్చని నిర్ధారించగలిగాడుగానీ ఎందుకొచ్చిందో చెప్పలేకపోతున్నాడు.''

"ప్చ్. ఎంత బాగా ఉండేవాడు ఎలా అయిపోయాడు?'' గుర్నాథం సానుభూతి సూచకంగా నిట్టూర్చాడు.



"ఎందుకలా లొట్టలేస్తున్నావ్? ఏం నా జిలేబీ కాజేద్దామనుకుంటున్నావా?" అన్నాడు శంకర్రావు గుర్నాథం కేసి గుర్రుగా చూస్తూ.

"మీ జిలేబీని ఆయనేం కాజేయరులెండి. ఆవకాయ జాడీని అటకమీద పెట్టాను" అంది ఊర్మిళ భర్తకేసి కోపంగా చూస్తూ.

"అందులో ఎలక పడిందిగా?" అన్నాడు శంకర్రావు.

"ఐతేనేం? దాన్ని మీ ఐరావతం తినేసిందిగా?"

"ఏంటీ నా ఐరావతం మళ్లీ బ్రతికిపోయిందా?"

"అవును. నిన్న పొద్దున్నే దాని తొండానికి ఆక్సిజన్ సిలిండర్ పెట్టి మళ్లీ బ్రతికించారు."

"మరి నా బసవన్న మాటేమిటి?"


"దాన్ని కూడా బ్రతికిస్తాను."

"అదేంటమ్మా. నువ్వు కూడా పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నావు?" గుర్నాథం ఆశ్చర్యంగా అడిగాడు.



## తప్పేంటి?

ఈమధ్య ఓ ఇంటర్వ్యూలో బిపాషా బసు డేరింగ్‌గా ఓ మాటంది- 'అవును. నేను సెక్సీగా కనిపిస్తాను. అయితే తప్పేంటి?' అంది. 'సెక్స్‌కీ, సెక్సీగా వుండడానికి చాలా తేడా వుంది. సెక్స్ అంటే ఆడా మగా లింగభేదం తెలిపేది. ఈ మాటని ఇంకోదానికి కూడా వాడుతుంటారనుకోండి. అందరికీ తెలుసు. సెక్సీగా వుండడం అంటే రొమాంటిక్ భావాలు కలిగించేలా కనిపించడం. అందం అంటూ వున్నాక అలా కనిపించడంలో తప్పేం వుంది చెప్పండి' అంటోంది బిపాషా.




"మరేం చేయమంటారు బావగారూ? ఈయనగారి పిచ్చి వేగలేక ప్రాణం విసిగి అప్పుడప్పుడు నేను కూడా ఇలా పిచ్చి పిచ్చిగా మాట్లాడడం అలవాటు చేసుకున్నాను" విషాదంగా నవ్వింది ఊర్మిళ.

శేషుమాంబ చెల్లెలికేసి జాలిగా చూసింది. చెల్లెలంటే నిజంగా సొంత చెల్లెలు కాదు పిన్నిగారి అమ్మాయి.

అంతలో సడెన్‌గా ఏదో గుర్తొచ్చినవాడిలా ఓమారు తల విదిలించి "అన్నట్లు మన జూలీ ఏది?' అని అడిగాడు.

"ఇంకెక్కడి జూలీ అండీ. మొన్న దాన్ని బావిలో వేసి చంపేసారుగా?"

"అలాగా? మరి ఇవ్వాళ చంపడానికి ఏముంది?"

"నేనున్నాగా. నన్ను వేయండి బావిలో" పళ్ళు నూరుతూ అంది ఊర్మిళ.

"ఊహూ... నువ్వు చాలా లావుగా వుంటావు. నిన్ను నేను మోయలేను. అదిగదిగో ఆ చిన్ని పాప అయితే బావుంటుంది?" అన్నాడు శంకర్ గుర్నాథం దంపతుల గారాలపుత్రిక అయినటువంటి బుజ్జికేసి వేలెత్తి చూపుతూ.

"అమ్మో..." అంటూ ఒక్క పరుగున కూతుర్ని చేరి ఆ పసిదాన్ని చేతుల్లోకి తీసుకుని హృదయానికి హత్తుకుంది శేషుమాంబ.

"నువ్వే గాభరా పడకక్కా. ఆయన ఊరికే అంటారలా. నిజంగా మీ బుజ్జిని బావిలో ఏం వేయరు?" అంది ఊర్మిళ.

"ఊరుకో ఉర్రూ. అతనా మాట అన్నందుకే నా గుండెలవిసిపోయాయి. ఇంకా కూర్చున్నారేంటండి. లేవండి పోదాం" అంది శేషుమాంబ.

"నిజమే...నిజమే. బ్రతికుంటే బలుసాక తినొచ్చు" అంటూ గుర్నాథం సోఫాలోంచి క్రిందకు దూకి సూట్‌కేస్‌లకేసి పెద్ద అంగలేసాడు.

"అదేంటి బావగారూ. ఇప్పుడేవచ్చి అప్పుడే వెళ్లిపోతారా?" ఊర్మిళ దిగులుగా అంది. "ఈయనగారి పిచ్చి గొడవలో పడి కనీసం కాఫీ అయినా ఇచ్చానుగాదు."

ఆమె అలా నొచ్చుకుంటుంటే "మరేం ఫర్వాలేదులేమ్మా. కాఫీ బయట తాగుతాంలే. నువ్వేం బాధపడకు" అన్నాడు గుర్నాథం.

"ఇది చాలా అన్యాయం అక్కా. కనీసం ఒక పూట భోజనం అయినా చేయకుండా వెళ్లిపోతున్నారు" ఊర్మిళ, శేషుమాంబతో అంది మరింత నొచ్చుకుంటూ.

"భోజనంకన్నా నాకు నా పిల్లల క్షేమమే ముఖ్యం ఉర్రూ. మరిదిగారికి పిచ్చి తగ్గాక ఉత్తరం రాయి. కావాలంటే అప్పుడు మళ్లీ వస్తాం" అంది శేషుమాంబ మీడియం సూట్‌కేసును చేతిలోకి తీసుకుంటూ.

"పాకిస్తాన్ గూఢచారులు వెళ్లిపోతున్నారా? దేనిమీద వెళ్తారట? నా ఐరావతాన్ని పంపనా?" అన్నాడు శంకర్రావు.

"వద్దు" అంటూ రెండు చేతుల్లో రెండు పెద్ద పెద్ద సూట్‌కేసుల్తో గడప దాటేసాడు గుర్నాథం. ఇంజన్ వెంట భోగీల్లా శేషుమాంబ ఆమె సంతానం అతన్ననుసరించారు.

***

"పిచ్చి సన్నాసులు. నెలరోజులు తిష్ట వేయడానికొస్తూ ఆ సంగతి అడ్వాన్స్‌గా ఉత్తరం రాసి మరీ వస్తారా? ఎలా కొట్టాను దెబ్బ?" అన్నాడు శంకర్, గుర్నాథం వాళ్ళు వెళ్లిపోయాక భార్యతో.

"భలే కొట్టారు దెబ్బ! బ్రహ్మాండంగా నటించారు మొత్తానికి" అంది ఊర్మిళ భర్తకేసి ప్రశంసాపూర్వకంగా చూస్తూ.

"నటనలో నువ్వు మాత్రం తక్కువ తిన్నావా? గ్లిజరిన్ లేకుండానే ఎన్ని కన్నీళ్ళు కార్చావ్?" అన్నాడు శంకర్ తను కూడా భార్యకేసి ప్రశంసాపూర్వకంగా చూస్తూ.

"ఎంతైనా మీ భార్యను కదా?" అంది ఊర్మిళ నవ్వేస్తూ.

★